సాక్షి
మంచిర్యాల
బుధవారం । 27 । డిసెంబర్ । 2023



కొనుగోలు కేంద్రానికి లారీ...

జనం గొంతుకై.. అక్షరాయుధమై..

'సాక్షి' ఎంతో మందిని అక్షరాయుధంతో కదిలించింది. ఆపదలో ఉన్నవారికి నేనున్నానం టూ చేయూతనందించింది. ఎన్నో సమస్యల పరిష్కారానికి దారి చూపింది. 8లో



ప్రకృతివనంలో మొక్కలెక్కడ?

జన్నారం మండలం కవ్వాల్ గ్రామంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతివనంలో మూడేళ్ల క్రితం వెయ్యి మొక్కలు నాటారు. నిర్వహణ లోపంతో ఇందులో ఒక్కటీ ఎదగలేదు. 9లో

గరిష్ఠం/కనిష్ఠం 31.0 /16.0

వాతావరణం

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. చలి తీవ్రత పెరుగుతుంది. ఈదురుగాలులు వీస్తాయి. రాత్రివేళ పొగమంచు కురుస్తుంది.

నేడు సింగరేణిలో ఓట్ల పండుగ



సామగ్రి పంపిణీ కేంద్రం వద్ద పోలింగ్ సిబ్బంది

- ఓటింగ్, కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి
- ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్
- రాత్రి 7గంటల నుంచి ఓట్ల లెక్కింపు.. ఫలితాలు వెల్లడి
- కార్మికుల భవిష్యత్‌ను నిర్దేశించే ఎన్నికలు

శ్రీరాంపూర్: సింగరేణిలో ఓట్ల పండుగకు సర్వం సిద్ధమైంది. వాయిదాలు.. తర్జన భర్జనల అనంతరం ఏడో దఫా గుర్తింపు సంఘం ఎన్నిక బుధవారం జరగనుంది. జిల్లాలోని శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియాల్లోని కార్మికులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఆయా ఏరియాల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి సిబ్బందికి విధులు కేటాయించారు. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు కార్మికులు ఓటు వేసేందుకు అవకాశం కల్పించారు. రాత్రి ఏడు గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభించి ఫలితాలు వెల్లడిస్తారు. శ్రీరాంపూర్‌లో ఓటింగ్ కోసం ఎన్నికల అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. డెప్యూటీ సీఎల్సీ, రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు ఆదేశాల మేరకు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు అల్లూర్ ఏ విశ్వనాథ్, ఎస్‌కే మహంతి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో విధులు నిర్వర్తించిన ప్రభుత్వ ఉద్యోగులకు శిక్షణ ఇచ్చి విధులు కేటాయించారు. మంగళవారం ఉదయం సీసీసీలోని ఎస్సీఓఏ క్లబ్‌లో సిబ్బందికి విధులు అప్పగించారు. ఎన్నికల పరిశీలకులు, ఆర్డీవో రాములు ఆధ్వర్యంలో పోలింగ్ అధికారులు, సిబ్బందికి సామగ్రి పంపిణీ చేశారు. బ్యాలెట్ పేపర్లు, బాక్స్‌లను డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి పోలింగ్ కేంద్రాలకు మధ్యాహ్నం వరకు తరలించారు. అన్ని గనుల సంక్షేమ అధికారులు, పర్సనల్ డిపార్టుమెంట్, సివిల్ అధికారులు ఎన్నికల ఏర్పాట్లను సమకూర్చుతున్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద ఏఆర్ ఓతోపాటు శ్రీరాంపూర్ జీఎం బీ.సంజీవరెడ్డి, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, ఇతర విభాగాల అధికారులు ఏర్పాట్లను పరిశీలించారు. శ్రీరాంపూర్ ఏరియాలో 15 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పోలింగ్ సిబ్బంది 75మంది, కౌంటింగ్ సిబ్బంది 30మంది విధులు నిర్వర్తించనున్నారు. ఓటు వేయడానికి కంపెనీ గుర్తింపు కార్డు తప్పనిసరిగా కాగా.. కార్డు లేని వారికి గనులపై తాత్కాలికంగా గుర్తింపు కార్డు ఇస్తారు.

పటిష్ట బందోబస్తు

ఎన్నికల నేపథ్యంలో మంచిర్యాల డీసీపీ సుధీర్‌రాంనాథ్ కేకన్ ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. 150మంది పోలీసులు బందోబస్తులో పాల్గొంటున్నారు. కౌటింగ్ కేంద్రాలను జైపూర్ ఏసీపీ మోహన్ పరిశీలించారు.

తగ్గిన ఓటర్లు..

శ్రీరాంపూర్‌లో ఓటర్ల సంఖ్య క్రితం ఎన్నికలతో పోల్చితే తగ్గింది. 2017 అక్టోబర్ 5న జరిగిన 6వ దఫా ఎన్నికల్లో 11,570 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈసారి ఎన్నికల్లో 9,124 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. దీంతో 2,446 మంది ఓటర్లు తగ్గారు. కాగా, శ్రీరాంపూర్‌లో ఈసారి 193 మంది మహిళా ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.



ఎన్నికల సామగ్రిని అందజేస్తున్న ఆర్డీవో రాములు



కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఏసీపీ



సామగ్రి తీసుకుంటున్న సిబ్బంది

మందమర్రి ఏరియాలో..

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలో 11పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా.. 4,835 మంది కార్మికులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. యాజమాన్యం అన్ని ఏర్పాట్లు చేసింది. ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా ప్రవీణ్‌పాండి మోహన్‌దాస్‌ను ఇప్పటికే నియమించారు. 96మంది ఎన్నికల విధుల్లో పాల్గొననుండగా.. 160మంది పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు. పోలింగ్ సిబ్బందికి సామగ్రి పంపిణీ చేశారు. పోలింగ్ అనంతరం ఏరియాలోని సీఈఆర్ క్లబ్ ఆవరణలో ఓట్ల లెక్కింపు నిర్వహించి ఫలితాలు ప్రకటిస్తారు. లెక్కింపు అనంతరం గెలించిన సంఘాన్ని ప్రాతినిధ్య సంఘంగా ప్రకటించనున్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు బెల్లంపల్లి ఏసీపీ సదయ్య, మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఏరియాలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఏసీపీ తెలిపారు. సీఈఆర్ క్లబ్ ముందు నుంచి ఉన్న కోల్‌బెల్ట్ రహదారిపై వాహనాలు వెళ్లకుండా సింగరేణి పార్క్ వెనుక నుంచి మళ్లించినట్లు తెలిపారు.

జైపూర్: జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటుతోపాటు ఇందారం ఐకే1ఏ గనిపై ఎన్నికలకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ఐకే1ఏ గని, ఐకే-ఓసీపీలో 1,217మంది ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఐకే1ఏ గనిపై ఎస్ఆర్‌పీ-8 పోలింగ్ కేంద్రంలో 664మంది, ఎస్ఆర్‌పీ-9బూత్‌లో 553మంది పవర్ ప్లాంట్‌లో 63మంది ఓటర్లు ఉన్నారు. జైపూర్ ఏసీపీ మోహన్, శ్రీరాంపూర్ సీఐ రమేశ్ బాబు, ఎస్సై ఉపేందర్‌రావు బందోబస్తు నిర్వహించనున్నారు.

రామకృష్ణాపూర్: మందమర్రి ఏరియా పరిధిలోని రామకృష్ణాపూర్ గ్రూప్ గనులు, డిపార్ట్‌మెంట్లకు రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆర్‌కేపీ ఓసీ, సీహెచ్‌పీ, ఆర్‌కే1ఏ, అనలిటికల్ ల్యాబ్‌లో 471 మంది ఓటర్లు ఉండగా.. ఆర్‌కేపీ ఓపెన్ కాస్ట్ గని కార్యాలయంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటుచేశారు. ఏరియా ఆస్పత్రిలో మొత్తం 158 మంది ఉద్యోగులుండగా ఆస్పత్రిలోనే మరో కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

బెల్లంపల్లి: శాంతిఖని క్యాంటీన్ పోలింగ్ కేంద్రంలో 461 మంది, ఏరియా ఆసుపత్రి ఆవరణ పోలింగ్ కేంద్రంలో 78 మంది ఓటర్లు ఉన్నారు. సింగరేణి అధికారులు ఏర్పాట్లు చేశారు.

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట గనిలో 1,204మంది కార్మికులు ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎన్నికల నిర్వహణ అధికారులు, పోలీస్ సిబ్బంది గనులపైకి చేరుకున్నారు.

న్యూస్‌రీల్

అసాంఘిక చర్యలకు అడ్డుకట్ట వేయాలి

- బెల్లంపల్లి ఏసీపీ సదయ్య
- తాండూర్ పీఎస్ తనిఖీ



తాండూర్ సర్కిల్ సిబ్బందితో ఏసీపీ సదయ్య

తాండూర్: అసాంఘిక కార్యకలాపాలను సమూలంగా అరికట్టేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని బెల్లంపల్లి ఏసీపీ పంతాటి సదయ్య సూచించారు. మంగళవారం మండలంలోని తాండూర్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరిసరాలు, రికార్డులు పరిశీలించారు. అనంతరం తాండూర్ సర్కిల్ పరిధిలోని పోలీస్ సిబ్బందితో మాట్లాడారు. పోలీసులు బాధ్యతాయుతంగా చట్టాలను స్వయంగా పాటిస్తూ ప్రజలకు ఆదర్శంగా నిలువాలని సూచించారు. అసాంఘిక చర్యలకు తావులేకుండా పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. నకిలీ విత్తనాలపై గట్టి నిఘా పెట్టాలని పేర్కొన్నారు. ఆర్థిక నేరాలను కట్టడి చేయడానికి ప్రతి ఏరియాలో సీసీ కెమెరాలు అమర్చుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సైబర్ నేరాల నియంత్రణకు గ్రామాల్లో ప్రజలు, ప్రజాప్రతినిధులు, యువకులకు పోలీసులు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎలాంటి ఫిర్యాదు వచ్చినా వెంటనే స్పందించాలని సూచించారు. తాండూర్ సీఐ శ్రీనివాసరావు, ఎస్సై రాజశేఖర్, అదనపు ఎస్సై శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

తెలుగు భాషా ప్రక్రియలో ప్రాచుర్యం పొందిన అవధానం

మంచిర్యాలఅర్బన్: తెలుగు భాషా ప్రక్రియలో అవధానం అనే భాషాక్రీడ అంతే ప్రాచుర్యం పొందిందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ అవధాని పట్వర్ధన్ పేర్కొన్నారు. మంగళవారం మంచిర్యాల సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో ఖండోభా ప్రసన్న సాహితీ సాంస్కృతిక సేవా సంస్థ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అష్టావధానం అంటే ఏకాగ్రత, అష్ట పృచ్ఛకులతో చేసే పద్యవిన్యాసం అని పేర్కొన్నారు. పట్వర్ధన్ మూడు శతావధానాలు పూర్తిచేసుకుని 117వ అష్టావధానం చేసి పండిత పామరులను రంజింప చేశారు. కార్యక్రమంలో కవులు, రచయితలు రాజేశ్వరశర్మ, వామన్‌రావు, సంతోష్‌కుమార్, శ్రీనాథ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి



కౌంటింగ్ ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్

శ్రీరాంపూర్: ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ సూచించారు. శ్రీరాంపూర్ ఏరియాలో నిర్వహిస్తున్న సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల ఏర్పాట్లను మంగళవారం ఆయన పరిశీలించారు. సీసీసీలో కౌంటింగ్ నిర్వహించే ఎస్సీవోఏ క్లబ్‌లను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని మూడు డివిజన్లలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్మికులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. డీసీపీ సుధీర్ రాంనాథ్‌కేకన్, ఏసీపీ మోహన్, ఆర్డీవో రాములు, శ్రీరాంపూర్ జీఎం బీ సంజీవరెడ్డి, డీజీఎం (పర్సనల్) అరవిందరావు ఉన్నారు.

పవర్‌ప్లాంట్ విస్తరణతో ఉద్యోగావకాశాలు



ప్లాంట్ వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్

జైపూర్: ప్లాంట్ విస్తరణ, కొత్త బొగ్గు బావుల ఏర్పాటుతో మెండుగా ఉద్యోగావకాశాలు లభిస్తాయని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి తెలిపారు. స్థానికులకే 80శాతం ఉద్యోగాలు ఇచ్చేలా ప్రత్యేక జీవో తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. జైపూర్ పవర్‌ప్లాంట్ వద్ద మంగళవారం పలువురు నాయకులు టీబీజీకేఎస్ నుంచి ఐఎన్టీయూసీలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ప్లాంట్‌కు చెందిన పలువురు ఉద్యోగులు, ఐకే-1 గనికి చెందిన కార్మికులు ఐఎన్టీయూసీలో చేరారు. అనంతరం వివేక్ మాట్లాడుతూ.. సింగరేణి సంస్థను కాపాడుకోవడానికి గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఐఎన్టీయూసీని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, మండలాధ్యక్షుడు ఫయాజ్, నాయకులు సత్యనారాయణరెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, రాకేశ్‌గౌడ్, వెంకన్న, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు వర్తింపజేస్తాం

- కలెక్టర్ జి సంతోష్
- అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమాభివృద్ధి ఫలాలు అందేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ బీ సంతోష్ సూచించారు. మంగళవారం అదనపు కలెకర్లు రాహుల్, మోతీలాల్, డీసీపీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పాలనను ప్రజలకు చేరువ చేసేందుకు ప్రజాపాలన నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హులందరికీ దశలవారీగా నిర్ణీత కాలవ్యవధిలో సంక్షేమాభివృద్ధి పథకాలు అందించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 28నుంచి జనవరి 6వ తేదీ వరకు మహాలక్ష్మి, రైతుభరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ, చేయూత పథకాలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. మండల స్థాయిలో అవసరమైన బృందాలు ఏర్పాటు చేసుకోవాలని, ప్రతీ బృందం రోజుకు రెండు గ్రామాల్లో సభలు నిర్వహించాలని సూచించారు. ప్రతీ వంద కుటుంబాలకు ఒక కౌంటర్ ఉండేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. వివిధ పద్ధతుల్లో దీనిపై విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. దరఖాస్తుదారులు ఎక్కువగా ఉంటే టోకెన్ విధానాన్ని అనుసరించాలని, ప్రజల సౌకర్యార్థం హెల్ప్‌డెస్క్ కౌంటర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. సంబంధిత అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని, రోజువారీ దరఖాస్తుల స్వీకరణ వివరాలు ప్రధాన కార్యదర్శికి నిర్ణీత నమూనాలో అందించనున్నట్లు పేర్కొన్నారు. స్వీకరించిన దరఖాస్తులు టీమ్ లీడర్ అధీనంలో ఉంచాలని, అన్నింటినీ భద్రపరిచి కంప్యూటీకరణ చేయనున్నట్లు తెలిపారు. దరఖాస్తుకు ఆధార్, తెల్లరేషన్‌కార్డు జత చేయాలని సూచించారు. దరఖాస్తుదారుకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని పేర్కొన్నారు. దరఖాస్తును రిజిష్టర్‌లో నమోదు చేయాలని, స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి ప్రతీ దరఖాస్తుకు ఒక ప్రత్యేక సంఖ్య కేటాయించాలని తెలిపారు. గ్రామసభ జరిగే చోట క్షేత్రస్థాయిలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. జెడ్పీ సీఈవో నరేందర్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శేషాద్రి, డీపీవో వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

ప్రజాపాలనకు శ్రీకారం




- రేపటి నుంచి జిల్లాలో అమలు
- ఆరు గ్యారంటీల అర్జీల స్వీకరణ
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ప్రజాపాలన'కు జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ నెల 28నుంచి జనవరి 6వ తేదీ వరకు కార్యక్రమం కొనసాగనుంది. సెలవు దినాలు మినహా ప్రతీరోజు ఉదయం 8నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 6గంటల వరకు పంచాయతీ, పట్టణాల్లో నిర్వహించనున్నారు. ప్రతీ నాలుగు నెలలకోసారి చేపట్టే కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని పట్టణాలు, వార్డులు, గ్రామాల్లో పంచాయతీల వారీగా సభలు నిర్వహిస్తారు. ఆ సభలోనే అధికారులు ప్రజల నుంచి ఆరు గ్యారంటీ పథకాల అమలుకు దరఖాస్తులు స్వీకరిస్తారు. సభలకు తహసీల్దార్, ఎంపీడీవోల ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు హాజరుకానున్నారు. ఇందుకోసం నియోజకవర్గ, మండల ఇన్‌చార్జి అధికారులతో కలెక్టర్ బదావత్ సంతోష్ మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతీ వంద కుటుంబాలకు ఓ కౌంటర్ చొప్పున వార్డుల్లో సభలు నిర్వహించనున్నారు. తహసీల్దార్, ఎంపీడీవో, పౌరసరఫరాల, వ్యవసాయ, వైద్యారోగ్య, విద్యుత్, గ్రామపంచాయతీ కార్యదర్శులతో కలిపి మొత్తం 10మంది అధికారుల బృందం హాజరవుతుంది. సభలు పకడ్బందీగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇన్‌చార్జి మంత్రి ప్రజాపాలన ఏర్పాట్లపై జిల్లా అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించాలి. ఉమ్మడి జిల్లాకు మంత్రి సీతక్కను ఇన్‌చార్జిగా నియమించారు. అయితే జిల్లాలో ఇన్‌చార్జి మంత్రి సమీక్షా సమావేశం ఇప్పటివరకు నిర్వహించలేదు.

'ఆరు గ్యారంటీ'లకు కీలకం

కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు ప్రజాపాలన కీలకం కానుంది. ఆరు గ్యారంటీ పథకాలైన మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పథకాల ఎంపికకు ప్రజాపాలన కార్యక్రమం కీలకంగా మారనుంది. ప్రభుత్వానికి సంబంధించిన ఏ పథకానికైనా ఈ సభల్లోనే దరఖాస్తులు స్వీకరించి.. అర్హులను ఎంపిక చేసే అవకాశం ఉంది. ఇందుకోసం జిల్లాలోని ఏడు మున్సిపాలిటీలైన మంచిర్యాల, లక్సెట్టిపేట, నస్పూర్, చెన్నూరు, క్యాతనపల్లి, మందమర్రి, బెల్లంపల్లి పట్టణాల్లోని 174వార్డుల్లోనూ సభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరిస్తారు. ఒక్కో గ్రామపంచాయతీ, వార్డులో ప్రత్యేక సభ ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలోని మూడు ప్రధాన నియోజకవర్గాలకు ముగ్గురు చొప్పున ప్రత్యేక అధికారులున్నారు. మంచిర్యాల నియోజకవర్గానికి జెడ్పీ సీఈవో నరేందర్, బెల్లంపల్లి నియోజకవర్గానికి ఆర్డీవో హరికృష్ణ, చెన్నూరు నియోజకవర్గానికి డీఆర్డీవో శేషాద్రి ఉన్నారు. వీరితో పాటు ప్రతీ మండలానికి ప్రత్యేకాధికారులు పని చేస్తున్నారు. సభలు, దరఖాస్తుల స్వీకరణ ఈ అధికారుల ఆధ్వర్యంలోనే చేపట్టనున్నారు.

'ప్రజాపాలన' విజయవంతం చేయండి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో నరేందర్

మంచిర్యాలటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 28వ తేదీ నుంచి చేపట్టనున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జెడ్పీ సీఈవో, మంచిర్యాల నియోజకవర్గ నోడల్ అధికారి కే నరేందర్ కోరారు. మంగళవారం జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో మంచిర్యాల నియోజకవర్గ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అర్హులందరికీ దశలవారీగా నిర్ణీత కాలవ్యవధిలో సంక్షేమాభివృద్ధి పథకాలను అందించేందుకే ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి పారదర్శకతతో క్షేత్రస్థాయిలో ప్రజల ముంగిట్లో ప్రభుత్వ పథకాలను అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలకు సామాజిక న్యాయం, ఆర్థిక సాధికారత చేకూర్చడానికే ఈ నెల 28నుంచి జనవరి 6వ తేదీ వరకు (ప్రభుత్వ సెలవులు మినహా) ప్రతీరోజు ఉదయం 8నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 6గంటల వరకు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. మహాలక్ష్మి, రైతుభరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ, చేయూత పథకాలకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. మండల స్థాయిలో అధికారులు బృందాలుగా ఏర్పడి ఒక్కో బృందం రోజుకు రెండు గ్రామాల్లో సభలు నిర్వహించాలని తెలిపారు.

సాయినాథుడికి మహాపుష్పాభిషేకం



సాయిబాబాను దర్శించుకుంటున్న భక్తులు



బాబాకు మహాపుష్పాభిషేకం చేస్తున్న అర్చకుడు

మంచిర్యాలఅర్బన్: స్థానిక షిర్డీ సాయిబాబా సంస్థాన్ మందిరంలో మంగళవారం శ్రీగురు దత్తాత్రేయ జయంతి వేడుకలు భక్తజన సందోహం మధ్య వైభవోపేతంగా జరిగాయి. ఉదయం 6గంటల నుంచి దత్తాత్రేయుడికి, సాయిబాబాకు మహాక్షీరాభిషేకం జరిపించారు. పురవీధుల్లో పల్లకీసేవ నిర్వహించారు. సాయిబాబాకు మహాపుష్పాభిషేకాన్ని నేత్రపర్వంగా జరిపించారు. సాయినాథుడిని దర్శించుకునేందుకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. అనంతరం బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో స్థానిక గీతాభవన్ హోటల్ నిర్వాహకుడు చంద్రశేఖర్‌శెట్టి- జ్యోతి అన్నదానం నిర్వహించారు. సత్యసేవా సమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ గడప రమేశ్, కార్యనిర్వాహక కమిటీ అధ్యక్షుడు గడప శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు, సత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

హమాలీవాడలో..

స్థానిక హమాలీవాడ షిర్డీ సాయిబాబా ఆలయంలో మంగళవారం దత్తజయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు హాజరై సాయిబాబాను దర్శించుకున్నారు. పాత మంచిర్యాల షిర్డీ సాయిబాబా ఆలయంలో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు.

గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌లో మంచిర్యాల నృత్యకళాకారులు



మంచిర్యాలఅర్బన్: కూచిపూడి నాట్య కళావైభవం పేరిట ఈ నెల 24న హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో నాట్యాచార్యులు పసుమర్తి శేషుబాబు ఆధ్వర్యంలో 3,783 మంది కళాకారులు డ్యాన్స్ లెస్సన్ వివరించి ఏడు నిముషాలపాటు ఒకేసారి నాట్యం చేసి అరుదైన గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ గుర్తింపు పొందారు. భారత్ ఆర్ట్స్ ఆకాడమీ నిర్వహించిన గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో మంచిర్యాలకు చెందిన 96 మంది కళాకారులు పాల్గొన్నట్లు నాట్యగురువు చిదానందకుమారి తెలిపారు. నిర్వాహకుల నుంచి సర్టిఫికెట్ అందుకున్నారని వివరించారు. వీరిని పలువురు అభినందించారు.

క్లుప్తంగా

గంజాయి స్వాధీనం

మందమర్రిరూరల్: పాత బస్టాండ్ సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్ద మంగళవారం ఒక యువకుడిని తనిఖీ చేయగా 200 గ్రాముల గంజాయి లభ్యమైనట్లు సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై చంద్రకుమార్ తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పెట్రోల్ బంకు వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఆవుల లాడెన్ (విద్యానగర్)ను పట్టుకుని తనిఖీ చేయగా గంజాయి లభించినట్లు తెలిపారు. విచారించగా చంద్రపూర్ నుంచి తక్కువ ధరకు గంజాయి తీసుకువచ్చి ఇక్కడ పలువురు యువకులకు విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు వారు పేర్కొన్నారు.

హత్యాయత్నం కేసు నమోదు

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలం కన్నాల శివారులోని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఇంటి ముందు సోమవారం రాత్రి జరిగిన గొడవలో ఇరువర్గాలపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు బెల్లంపల్లిరూరల్ సీఐ రాజ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. ఆరిజిన్ డెయిరీ సీఏవో బోడపాటి శేజల్, సీఈవో ఆదినారాయణ మాజీ ఎమ్మెల్యే చిన్నయ్యను కులం పేరుతో దూషిస్తున్న క్రమంలో అక్కడే ఉన్న భీమ శంకర్‌తో పాటు మరో ఇద్దరు వారిని అడ్డుకున్నారు. పరస్పరం జరిగిన దాడిలో శేజల్ కారు అద్దాలు ధ్వంసమయ్యాయి. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు ఇరువురిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. శేజల్, ఆదినారాయణపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

జాతీయ రహదారిపై బొలెరో బోల్తా



క్రేన్ సాయంతో వ్యాన్‌ను తీస్తున్న సిబ్బంది

తాండూర్: తాండూర్ బస్టాండ్ సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం అదుపు తప్పి బొలెరో బోల్తా పడింది. సిర్పూర్ నియోజకవర్గంలోని కౌటాల గ్రామం నుంచి బియ్యం లోడ్‌తో బెల్లంపల్లికి వెళ్తున్న వాహనం టైర్ పేలడంతో అదుపుతప్పి రోడ్డుపై పడిపోయింది. ఘటనలో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. బియ్యం సంచులు రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోవడంతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకుని క్రేన్ సాయంతో వ్యాన్‌ను పక్కకు తీసి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని మేకలవాడకు చెందిన మోతె లక్ష్మికి చెందిన ఇల్లు సోమవారం రాత్రి ప్రమాదవశాత్తు దగ్ధమైంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం ఇంట్లో ఒంటరిగా నివసిస్తున్న లక్ష్మి రాత్రి సమీపంలో ఉన్న బంధువుల ఇంట్లో నిద్రించేందుకు వెళ్లింది. మంగళవారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా పూర్తిగా దగ్ధమైనట్లు తెలిపింది. ఇంట్లో రూ.30వేలు, అర తులం బంగారం, పట్టాపాస్ పుస్తకం, పింఛన్ బుక్, బట్టలు పూర్తి కాలిపోయాయని వాపోయింది. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కోరుతోంది.

ఆవుపై పులి దాడి ..!

నస్పూర్: పట్టణ పరిధిలోని సింగరేణి పాలిటెక్నిక్ సమీపంలో గాయాలపాలైన ఆవు కనిపించడంతో అటుగా వెళ్తున్న వాహనదారులు వీడియో తీసి ఆవుపై పులి దాడిచేసిందంటూ సోషల్ మీడియాలో షేర్ చేసిన వీడియో వైరల్ అయ్యింది. ఈ విషయమై మంచిర్యాల ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రత్నాకర్‌ను వివరణ కోరగా ఆవు గాయపడిన విషయం మూడు రోజుల క్రితమే మా దృష్టికి వచ్చిందన్నారు. ఆవుపై ఎలాంటి పులి, మరే ఇతర జంతువు దాడి చేయలేదన్నారు. రోడ్డుపై ఏదైనా వాహనం ఢీకొట్టి ఉంటుందన్నారు. ప్రజలు ఎలాంటి భయాందోళనకు గురికావద్దన్నారు.

జనం గొంతుకై.. అక్షరాయుధమై..

ఒక సిరాచుక్క వేయి మెదళ్లకు కదలిక అన్న మహాకవి కాళోజీ స్ఫూర్తితో 'సాక్షి' ప్రతీ అక్షరం.. ప్రజాపక్షం అన్నట్లుగా ప్రస్థానం సాగిస్తోంది. 16 ఏళ్ల ప్రయాణంలో ప్రజల గొంతుకై.. అధికారులు, పాలకులపై అక్షరాయుధాన్ని సంధించింది. కాల గమనంలో భాగంగా 2023 కాలగర్భంలో కలియబోతోంది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది 'సాక్షి' ఎంతోమందిని తన అక్షరంతో కదిలించింది. ఆపదలో ఉన్నవారికి చేయూతనందించింది. సమస్యల పరిష్కారానికి దారి చూపింది. ఈ క్రమంలో సాక్షి కథనాలకు వచ్చిన కొన్ని స్పందనలు ఇవీ..

- సమస్యలు వెలుగులోకి తెచ్చిన 'సాక్షి'
- ఆపద్బాంధవులను కదిలించి.. ఆపన్నులకు అండగా నిలిచిన అక్షరం

బెల్లంపల్లి: అసెంబ్లీ ఎన్నికల ప్రచార లెక్కల్లో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య అవకతవకలకు పాల్పడిన వైనాన్ని 'ప్రచార అనుమతి లెక్కల్లో తేడాలు' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందనగా కమిషనర్‌పై బదిలీ వేటు పడింది.

- వేమనపల్లి మండలానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో 'ఫ్రీజర్నీ వారికి దూరం' శీర్షికన ప్రచురించిన కథనానికి స్పందించిన అధికారులు బస్సును ప్రారంభించారు.

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు కేంద్రాలకు వెళ్లకుండా ఉండేందుకు డబ్బులు వసూలు చేయడంపై 'అంగన్‌వాడీ టీచర్ల వసూళ్లు?' కథనానికి స్పందించిన మహిళా శిశు సంక్షేమ శాఖ వరంగల్ ఆర్జేడీ బి.ఝాన్సీరాణి సీడీపీవోపై చర్యలు తీసుకున్నారు.

- జన్నారం మండలం కలమడుగులో పడిపోయిన విద్యుత్ స్తంభంపై 'పడిపోయినా పట్టించుకోరా' అనే శీర్షికన సెప్టెంబర్ 17న ప్రచురించిన కథనానికి స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు వెంటనే సరిచేశారు.
- నస్పూరులోని ప్రభుత్వ భూమిలో 'ఆగని భూఆక్రమణలు' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి వాటిని తొలగించారు. అదే మండలంలో 'సెలవు రోజు అక్రమ నిర్మాణాల జోరు' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి అక్రమంగా వెలసిన షెడ్డును తొలగించారు.

2023 రివైండ్

- దండేపల్లి మండలంలోని నెల్కి వెంకటాపూర్‌లో మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడడంతో 'సాగునీరు కాదు మిషన్ భగీరథ నీరే' శీర్షికన మే 15న ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి మరమ్మతులు చేశారు. ఇదే మండలంలోని ముత్యంపేట నుంచి చింతపల్లికి బీటీ, సీసీ రోడ్డు వేసి రోడ్డుకు ఇరువైపులా మట్టి పోయక పోవడంపై 'రోడ్డు వేశారు... మొరం మరిచారు' వార్తకు స్పందించిన అధికారులు మొరం పోశారు.
- మంచిర్యాల బస్టాండులో దివ్యాంగుల సౌకర్యార్థం వీల్‌చైర్లు లేకపోవడంతో మే 12న 'వీల్‌చైర్లు నిరుపయోగం' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు రెండు వీల్‌చైర్లు ఏర్పాటు చేశారు.
- హాజీపూర్ మండలంలోని ముత్యంపేటలో 'నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్‌షాపు నిర్వహణ'పై అధికారులు స్పందించి ఆ షాపును మూసివేయించారు. దళిత రైతులకు సంబంధించిన 'మా వడ్లు ఎందుకు కొనరు' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి ఆ ధాన్యాన్ని కొనుగోలు చేశారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానం చెత్తతో నిండిపోవడంతో 'డంపింగ్‌యార్డులా పాఠశాల మైదానం' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన అధి కారులు పారిశుధ్య కార్మికులతో చెత్తను తీయించారు.

- జిల్లా కేంద్రంలోని పంచాయతీ అధికారి కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో 'భయం గుప్పిట్లో విధులు' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కార్యాలయాన్ని కలెక్టరేట్‌కు తరలించారు.
- భీమారం నుంచి ఆరెపల్లి వెళ్లే దూరాన్ని తగ్గిస్తూ నేషనల్ హైవే అధికారులు బోర్డు ఏర్పాటు చేయగా 'దూరం తగ్గించిన నేషనల్ హైవే అధికారులు' శీర్షికన ఈనెల 8న ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించి దూరాన్ని సరిచేస్తూ సూచిక ఏర్పాటు చేశారు.

కెరమెరి: జంగుబాయి పుణ్యక్షేత్రంలో తాగునీటి ఇబ్బందులపై మే 13న 'అమ్మ చెంత తాగునీటి చింత' శీర్షికన ప్రచురించిన కథనానికి కలెక్టర్ హేమంత్ బోర్కడే స్పందించి ట్యాంకర్ల తోనీటినిఅందించారు.

- గోయగాంలో యువకులు ఏర్పాటు చేసుకున్న గ్రంథాలయంలో పుస్తకాల కొరతపై మే 19న 'పుస్తక దాతలు కావలెను' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన ఎమ్మెల్యే ఆత్రం సక్కు రూ.10 వేలు, కాగజ్‌నగర్‌కు చెందిన హన్మంతు ఫర్నిచర్ అందించారు.
- కెరమెరి పీహెచ్‌సీలో వైద్యాధికారి లేక రోగులు పడుతున్న ఇబ్బందులపై జూలై 17న 'వైద్యాధికారి కావలెను' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన డీఎంహెచ్‌వో డాక్టర్ దీనేష్ కుమార్‌ను నియమించారు.
- పెద్దవాగుతో గ్రామీణులు పడుతున్న అవస్థలపై సెప్టెంబర్ 3న 'రియల్ బాహుబలి' శీర్షికన ప్రచురితమైన కథనానికి కలెక్టర్ హేమంత బోర్కడే స్పందించి పరిస్థితిపై ఆరా తీయించారు.
- సెప్టెంబర్ 12న 'ఎవరెస్ట్ వైపు తొలిఅడుగు' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన ఎమ్మెల్యే ఆత్రం సక్కు కెలికే గ్రామానికి చెందిన కార్తీక్‌కు రూ.10 వేలు, ఎస్సై విజయ్ రూ.5 వేలు ఇచ్చారు.

దహెగాం: 'నిండా ముంచింది' శీర్షికన ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

- 'తాటికమ్మ గుడిసెలోనే' శీర్షికన జూన్ 29న ప్రచురితమైన కథనానికి స్పందించిన కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు, ఎస్సై సనత్‌కుమార్ స్పందించి బోరెం లస్మయ్యకు నగదుతో పాటు సరుకులు అందించారు.
- ఈ నెల 7న 'ధాన్యం కొనేది లేనట్టేనా..?' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన ఉన్నతాధికారులు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.







గెలిచిన సంఘాలు అన్యాయం చేశాయి

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్

శ్రీరాంపూర్: సింగరేణిలో ఇప్పటి వరకు గెలిచిన సంఘాలు కార్మికులకు అన్యాయమే చేశాయని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ అన్నారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గెలిచిన సంఘాలు కార్మికుల హక్కులను తాకట్టుపెట్టాయన్నారు. గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగినప్పటి నుంచి ఇప్పటి వరకు కంపెనీలో 69 వేల ఉద్యోగాలు తగ్గాయని, దీనికి కారణం వారేనన్నారు. కోలిండియాలో ఒప్పందం ఉన్నా ఇప్పటికీ కార్మికుల అలవెన్సులపై ఆదాయ పన్నును ఎందుకు మాఫీ చేయించలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ గెలిస్తే ప్రతి కార్మికునికి 250 గజాల ఇంటి స్థలం, రూ.30 లక్షల వడ్డీ లేని రుణం ఇప్పిస్తామన్నారు. సమావేశంలో ఆ యూనియన్ బ్రాంచి అధ్యక్షుడు గుల్లా బాలాజీ, కార్యదర్శి గోదారి భాగ్యరాజ్, ఉపాధ్యక్షుడు కస్తూరి చంద్రశేఖర్, నాయకులు వెంకటేశ్, బానేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భూపాల్

కార్మికులకు ఇంటిస్థలం ఇప్పిస్తా

- ఎమ్మెల్యే కే.ప్రేంసాగర్‌రావు

శ్రీరాంపూర్: సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఐఎన్టీయూసీని గెలిపిస్తే కార్మికులకు 250 గజాల ఇంటిస్థలం ఇప్పిస్తానని మంచిర్యాల ఎమ్మెల్యే కే.ప్రేంసాగర్‌రావు అన్నారు. బుధవారం నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అలవెన్సులపై ఆదాయ పన్ను మాఫీ చేయిస్తామని, డీఎంఎఫ్‌టీ నిధులు ఇక్కడే ఖర్చు చేయిస్తామన్నారు. సమావేశంలో ఐఎన్టీయూసీ బ్రాంచీ ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, కేంద్ర ఉపాధ్యక్షులు కలవేన శ్యాం, మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జి తిరుపతిరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, మంచిర్యాల పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్, నాయకులు భీంరవి, జే నర్సింగ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

ట్రాక్టర్, బైక్ ఢీ.. ఇద్దరికి గాయాలు

బెజ్జూర్: ట్రాక్టర్, బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై విక్రమ్ తెలిపిన వివరాల ప్రకారం కృష్ణపల్లి గ్రామానికి చెందిన నికాడి శంకర్ తన కూతురితో కలిసి ద్విచక్ర వాహనంపై బెజ్జూర్ నుంచి కృష్ణపల్లి వెళ్తుండగా బెజ్జూర్ వైపు పత్తి లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. శంకర్‌తో పాటు అతని కూతురుకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.

రేషన్‌డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గం

మంచిర్యాలటౌన్: రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గాన్ని జిల్లా కేంద్రంలో మంగళవారం 18మండలాల అధ్యక్ష, కార్యదర్శుల సమక్షంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మోటపలుకుల సత్యనారాయణరెడ్డి, గౌరవాధ్యక్షుడిగా అరుముల్ల పోశం, ప్రధాన కార్యదర్శిగా బొమ్మ సత్యనారాయణరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అంకం మనోజ్, ఉపాధ్యక్షులుగా సాగె సుజాత, రాజారాం, శంకర్, రామాంజనేయులు, జాఫర్ అలీ, పోలంపల్లి సత్యసాగర్, పోడేటి శ్రీనివాస్, కోశాధికారిగా రావికంటి కిషన్, కార్యదర్శులుగా వీ శంకరయ్య, మల్లేశ్, సముద్రాల స్వరూప, సౌజన్య, దాసరి తిరుపతమ్మ ఎన్నికయ్యారు.



నూతన కార్యవర్గ సభ్యులు

పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య

జైనూర్: పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన జైనూర్ మండలంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పొలాస గ్రామానికి చెందిన గోండ్‌వరే అయిలాబాయి(28) ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. గమనించిన గ్రామస్తులు హుటాహుటిన జైనూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఉట్నూర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలికి భర్త కృష్ణ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

'ఐఎన్టీయూసీని గెలిపించండి'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్

మందమర్రిరూరల్: సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘమైన ఐఎన్టీయూసీ గడియారం గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి కోరారు. మంగళవారం ఏరియాలోని వర్క్‌షాప్ కార్మికులను కలిసి మాట్లాడారు. ఐఎన్టీయూసీని గెలిపిస్తే నూతన గనుల ఏర్పాటు, ప్రభుత్వం సింగరేణికి బకాయి పడిన రూ.29 వేల కోట్లు చెల్లించే విధంగా కృషి చేస్తామని, కార్మిక హక్కుల సాధనలో యూనియన్‌కు ప్రభుత్వం అండగా ఉంటుందని వివరించారు.

ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్టర్స్ ఉమ్మడి జిల్లా కమిటీ ఎన్నిక

మంచిర్యాలటౌన్: ఔట్ సోర్సింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా మండల భాస్కర్‌గౌడ్, గౌరవ అధ్యక్షుడిగా దుర్గం శేఖర్, ప్రధాన కార్యదర్శిగా దున్న సునిల్ కుమార్, లీగల్ అడ్వైజర్ కమిటీ చైర్మన్‌గా గురునాథం బాబు గౌడ్, ఉపాధ్యక్షులుగా బి.దేవేందర్, వై. రాజశేఖర్‌రెడ్డి, ఎస్.జయశీల, రత్నం శ్రీకాంత్, కన్వీనర్‌గా భూపెల్లి మల్లేశ్, కోశాధికారిగా గడ్డం మహవీర్, కార్యదర్శులుగా పానగంటి హరీష్, కొండగూర్ల చంద్రశేఖర్, రజిత, మురళి, అధికార ప్రతినిధులుగా ఎస్. దేవరాజ్, కోకన్వీనర్లుగా గణేశ్, వెంకటేశ్, మారపెల్లి కుమార్, జనార్దన్, కార్యవర్గ సభ్యులుగా గంగారపు నటరాజ్, నెన్నెల నర్సయ్య, నాగమల్లేశ్, మిట్ట సుజాత, గౌతమ్, రామగోని మహేందర్, అరిగెల నరేశ్ గౌడ్, బి. శ్యాంకుమార్, చిలుముల రమేశ్, నరేశ్, వేముల రాజలింగు, బొల్లం నాగరాజును ఎన్నుకున్నారు.

జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక



మానస



వైష్ణవి

మంచిర్యాలటౌన్: మంచిర్యాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు కోచ్ సీహెచ్.రాజేశ్ తెలిపారు. పట్టణంలోని మోడల్ స్కూల్‌లో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న నల్ల మానస, సెకండియర్ చదువుతున్న అగ్గు వైష్ణవి ఈ నెల 22న హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. జనవరి 3 నుంచి 8 వరకు ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి పోటీలలో పాల్గొననున్నారు.

'డప్పు' మూగబోయింది..

- రోడ్డు ప్రమాదంలో కళాకారుడు సమ్మయ్య మృతి
- పెద్దకర్మకు వెళ్లివస్తూ తిరిగిరాని లోకాలకు..



సంఘటన స్థలంలో మృతదేహం

మంచిర్యాలరూరల్ (హాజీపూర్): డప్పును ఇంటిపేరుగా మార్చుకున్న ఆయన అందరికీ ఆప్తుడు. ఉద్యమకారుడిగా, ధూం ధాం కళాకారుడిగా, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుడిగా ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్తున్న ఆయనను రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం కొల్లూరుకు చెందిన డప్పు సమ్మయ్య అలియాస్ శ్రీరాముల సమ్మయ్య (39) సీసీసీ కార్నర్‌లో నివాసం ఉంటున్నాడు. ప్రస్తుతం కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా తెలంగాణ సాంస్కృతిక సారథి కో ఆర్డినేటర్‌గా పని చేస్తున్నాడు. జానపద కళాకారుడిగా, కవిగా, రచయితగా తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొని తన గళంతో ఉద్యమ పాటలు పాడి ప్రజలను చైతన్యం చేయడంలో కీలకమయ్యాడు. ఉద్యమ సమయం నుంచి డప్పు సమ్మయ్యగా అందరి హృదయాల్లో నిలిచిపోయాడు. సారా వ్యతిరేక ఉద్యమం, ఓపెన్ కాస్ట్ వ్యతిరేక ఉద్యమంలోనే కాకుండా నిరక్షరాస్య నిర్మూలన, జన విజ్ఞాన కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్యం చేశాడు. తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రొఫెసర్ ఖాసీం ఆధ్వర్యంలో నడిపిన తెలంగాణ పక్షపత్రిక ద్వారా అనేక వ్యాసాలు రాసాడు. సోమవారం లక్సెట్టిపేట మండలంలో ఓ పెద్దకర్మ కార్యక్రమానికి తోటి కళాకారులతో కలిసి హాజరయ్యాడు. రాత్రి 9 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా హాజీపూర్ మండలం గుడిపేట బుగ్గగట్టు సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. అతనికి భార్య రజిత, కుమార్తె సిరివెన్నెల, కుమారుడు సూర్యచరణ్ ఉన్నారు. రజిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.



సమ్మయ్య (ఫైల్)

వెంకటయ్య బావి నవల ఆవిష్కరణ

లక్డీకాపూల్: వెంకటయ్య బావి నవలతో సాహిత్యంలో మూడు ప్రక్రియల్లో దాసరి మోహన్ సాధన చేస్తున్నారని నందిని సిధారెడ్డి అన్నారు. తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన నవలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దండెం, అల్మారా కవితల సంపుటి, రాళ్ల కుచ్చె కథా సంపుటి రచించిన దాసరి సరికొత్త ఆవిష్కరణలు చేస్తున్నారని తెలిపారు. మోహన్ తన నవలను అక్షర కౌముది సంస్థకు అంకితం చేయడం అభినందనీయమన్నారు. జంట నగరాల అధ్యక్షుడు కందుకూరి శ్రీరాములు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ రచయిత రూప్‌కుమార్ డబ్బీకార్ పుస్తక పరిచయం చేశారు. కాంచనపల్లి గోవర్ధనరావు, పొత్తూరి సుబ్బారావు, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు నాళేశ్వరం శంకరం, రమాదేవి కులకర్ణి, బెల్లంకొండ సంపత్‌కుమార్ పాల్గొన్నారు.



నవల ఆవిష్కరిస్తున్న నందిని సిధారెడ్డి

వీధి కుక్కలకు వింత రోగం

దండేపల్లి(మంచిర్యాల): మండలంలోని కన్నెపల్లిలో తిరిగే వీధి కుక్కలకు వింత రోగం సోకింది. వ్యాధి సోకిన కుక్కల చర్మం మొత్తం ఊడిపోయి భయంకరంగా కనిపిస్తున్నాయి. కొద్ది రోజుల క్రితం ఒకటి రెండు కుక్కలకు మాత్రమే ఈ వ్యాధిసోకగా క్రమంగా వాటి సంఖ్య పెరుగుతోంది. అధికారులు స్పందించి కుక్కలను ఊరినుంచి తరిమేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈవిషయమై మండల పశువైద్యాధికారి ధన్‌రాజ్‌ను సంప్రదించగా ఇది ఫంగస్ ద్వారా జంతువులకు సోకుతుందన్నారు. ముఖ్యంగా వీధి కుక్కల్లో ఎక్కువ వస్తుందని, కేవలం చలికాలంలో మాత్రమే దుమ్ము ద్వారా వస్తుందన్నారు. దీంతో మనుషులకు ఎలాంటి ప్రమాదం ఉండదని, ఇది జంతు సంక్రమిత వ్యాధి మాత్రమే అని చెప్పారు.



వింతరోగం సోకిన శునకం

రెండు ఇళ్లల్లో చోరీ

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీసుస్టేషన్ పరిధిలోని దుర్గానగర్ కాలనీలో రెండిళ్లలో చోరీ జరిగినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మాదస్తు విజయ్‌కుమార్ సోమవారం ఇంటికి తాళం వేసి కుటుంబ సమేతంగా హైదరాబాద్ వెళ్లాడు. అలాగే వారి బంధువులైన మాదస్తు లక్ష్మి సైతం తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లింది. రాత్రి దొంగలు ఈ రెండు ఇళ్లల్లో చొరబడ్డారు. విజయ్‌కుమార్ ఇంట్లోని అరతులం బంగారంతో పాటు నాలుగు తులాల వెండి, రూ.6వేల నగదును ఎత్తుకెళ్లారు. లక్ష్మి ఇంట్లో నుంచి వెండి ఆభరణాలు అపహరించారు. ఇరువురి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE
PLOT FOR SALE
Banjara Hills, Road No. 3, 200 Sq.yards Open Plot. (Size: 40'x45') N/F, Reg. Document. U.L.C.N.O.C. Near Kalyani Mandapam. Mr. Khaja. PH: 8639447160. [HA-1034]

SERVICES
BUSINESS OFFER
ద్వారకా ఎంటర్‌ప్రైజెస్: పేపర్ ప్లేట్స్ & LED మెషీన్స్‌పై ప్రతినెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం, ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. 9310515624, 8800496710 [H-42904]

WANTED
హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను,పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీ. 18 K. ఫోన్: 9640258899 / 9640468899. [H-793668]

మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్‌గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. 9849933042, 9177736926. [M-1167575]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888, 9010299065,
9951602823, 9010608462,